www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 21 మార్చి 2025



మేళాలో 129 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - కాకినాడ


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

స్థానిక జగన్నాధపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ సంస్థల్లో 129 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి తెలిపారు. ఈ మేళాలో జెకెసి కో ఆర్డినేటర్ డాక్టర్ పి.సంజోత, హెచ్ఆర్‌సి విజయలక్ష్మి, జి.రాజెష్, కె.ఉదయ సంకర్, బి.శంతోష్, స్నేహలత, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మల్లెల సువర్చల, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఎం.వసంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై పని దినాల కత్తి

లక్ష్యం చేరుకోకపోతే వేతనం నిల్
ఆందోళనలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం అమలులో క్షేత్రస్థాయిలో కీలకంగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల మెడపై కత్తి వేలాడుతోంది. దీంతో ప్రజా ప్రతినిధులను కలిసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకుంటున్నారు. సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు దశలవారీ పోరాటాలు చేసినా అధికార యంత్రాంగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పని దినాలతో సంబంధం లేకుండా వేతనం ఇవ్వడం తోపాటు, జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా పని దినాల ఆధారంగానే జీతాలు ఇస్తుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గతంలో 910 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లక్ష్యాలను చేరుకోవడంతో వెనుకపడుతూ వచ్చారు. ఈ విధంగా దశలవారీగా 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయారు. ఇదే విధానం అమలు చేస్తే రాబోయే రోజుల్లో పూర్తిగా ఉపాధికి దూరమవుతారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో టార్గెట్లను ఉపసంహరించుకుని ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం నెలకు రూ.26000 అమలు చేయాలనే డిమాండ్ ముందుకొస్తోంది.

అందని ద్రాక్షలా టార్గెట్లు

ఏడాదిలో గ్రామంలో 7,500 పని దినాలు కల్పించిన వారిని ఎ గ్రేడ్ కింద చేర్చి వారికి నెలకు రూ.8,900 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 7,500-6,500 మధ్య పని దినాలు కల్పించిన వారిని బి గ్రేడ్‌గా పరిగణించి రూ.7,900 వేతనం, రూ.350 అలవెన్స్‌లు, 5,000 నుంచి 6,500 మధ్య పనిదినాలు కల్పించిన వారిని సి గ్రేడ్‌గా పరిగణించి రూ.6,400 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 5,000 కంటే తక్కువ పని దినాలు కల్పించిన వారికి జీతాలు ఉండవు. వీరిని సీనియర్ మేట్‌గా పరిగణిస్తారు. ఈ విధంగా జిల్లాలో 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయినట్లు తెలుస్తోంది. ఎ గ్రేడ్, బి గ్రేడ్, సి గ్రేడ్ కోటాలో కొందరికి మాత్రమే జీతాలు చెల్లించి మిగిలిన వారికి మొండిచేయి చూపిస్తూ పొమ్మన కుండా పొగబెడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.


కూలీలత ఉపాధి పనులు చేయిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

మూడు నాలుగు నెలలే పనులు..

ఉపాధి హామీ పనులు ఏడాదంతా సాగడం లేదు. వేసవిలో మూడు నుంచి నాలుగు నెలలకు మించి పనులు జరగడం లేదు. ఫిబ్రవరి, మే వరకే కాస్త హడావుడి కనిపిస్తోంది. మిగతా రోజుల్లో వ్యవసాయ పనులు ఉన్నందున ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో రెండేళ్లుగా వ్యవసాయ పనుల్లో జనం బిజీగా ఉండటంతోనూ ఉపాధి పనులు పెద్దగా సాగడం లేదు. ఈ పరిస్థితులలో తమ ఉద్యోగ భద్రత కరువైందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో దశలవారీ ఆందోళనలను ప్రారంభించారు. మున్సిపాలిటీలలో విలీనమైన గ్రామ పంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయం చూపించాలని కోరుతున్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం కల్పించి 200 రోజులు పని కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అర్హత, అనుభవం కల్గిన ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్, మండల స్థాయిలో బదిలీల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, జూనియర్ మేట్, సీనియరల్ మేట్, ఫీల్డ్ అసిస్టెంట్ అనే తారతమ్యం లేకుండా అందరినీ ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా పరగణించి వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి బిందుమాధవ్

అర్జీలపై తక్షణమే చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

మహిళలు, బాలికలకు సంబంధించి వచ్చిన అర్జీలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.బిందుమాధవ్ ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెల వారి నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా మాట్లాడి ఫిర్యాదులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. మహిళల రక్షణ కొరకు ఏర్పాటు చేయబడిన శక్తి యాప్‌ను మహిళలు, బాలికలు అందరికీ చెప్పి ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేయించాలన్నారు. మహిళలు, బాలికల రక్షణ, భద్రత కొరకు ఉన్న అన్ని హెల్ప్‌లైన్ నంబర్లను బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించాలని ఆదేశించారు. వేసవికాలంలో రాత్రి సమయంలో నేరాలు అధికంగా జరిగే అవకాశం ఉందని, నేరాలు జరగకుండా ఉండే విధంగా రాత్రి గస్తీలు పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్నా కేసులపై దర్యాప్తును త్వరగతిన పూర్తి చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసులను చేదించినట్లయితే వారిని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం బహుకరించే ఎబిసిడి అవార్డుకు నామినేట్ చేస్తామని తెలిపారు. జిల్లాలో ఏ ప్రాంతంలోను చైన్ స్నాచింగ్ జరగడానికి వీలు లేదన్నారు. చైన్ స్నాచింగ్ వంటికి పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్స్‌కి సంబంధించిన వివరాలను రికార్డుల్లో పొందుపర్చాలని ఆదేశించారు. హైస్కూల్స్, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల వద్ద మహిళలు, బాలికలకు శక్తి యాప్ నిక్షిప్తం, విద్యార్థులందరికీ గుడ్ టచ్-బాడ్ టచ్, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు వినియోగంపై డ్రగ్స్ వద్దు బ్రో వంటి అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రతి పోలీస్ స్టేషన్ శివారా ప్రాంతాలు అన్ని సిసి కెమెరాలు నిఘా పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశం అనంతరం ఏలేశ్వరంలో బంగారం షాప్ చోరీ కేసును చేదించిన అధికారులకు, గొల్లపాలెం పోలీస్ స్టేషన్ నందు అక్రమంగా తుపాకులతో సంచరిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన అధికారులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఎపిఎస్‌పి బెటాలియన్స్ ఐజిపి బి.రాజకుమారి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పిలు ఎంజెవి.భాస్కరరావు, ఎఆర్ శ్రీనివాసరావు, ట్రైనీ ఎఎస్‌పి సుస్మిత, డిఎస్‌పిలు మనీష్ దేవరాజ్ పాటిల్, శ్రీహరిరాజు, ట్రైనీ డిఎస్‌పి జీవన, సిఐలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక నిధులు

ప్రజాశక్తి - తాళ్లరేవు


వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జెడి

వ్యవసాయ రంగానికి బడ్జెట్లో ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందని వ్యవసాయ శాఖ జెడి విజయకుమార్ తెలిపారు. మండలంలోని పి.మల్లవరంలో రైతులు ధూళిపూడి వెంకటరమణ, దడాల సత్తికొండ ఆధ్వర్యంలో సేద్యం చేస్తున్న కృషి అమృత్ గోవు ఆధారిత వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. నాటు విత్తనాలు ప్రోత్సాహించాలనే లక్ష్యంతో క్షేత్రంలో వేసిన రక్తశాలి, కుజిపటాలియా, ఆర్ఎన్ఆర్ పంట చేనును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తొలకరిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన బ్లాక్ రైస్‌ను ధూళిపూడి ఆయనకు బహుకరించారు. ఈ సందర్భంగా రసాయనాలకు బదులుగా వాడుతున్న కషాయాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఎడి కె.బాబూరావు, వ్యవసాయ సిబ్బంది అజయ్, సుధ, సర్పంచ్ పంపన రామకృష్ణ పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రోజు రోజుకీ ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో బాటసారులకు దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకృతి పరిరక్షణ సంఘం అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సకిరెడ్డి విజయబాబు అన్నారు. గురువారం మెయిన్ రోడ్డులో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేశ్వరంకు వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చేందుకే ఈ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

గురువారం వారాంతపు సంత కావడంతో చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి గొల్లాజిరావు, వరుపుల చిట్టిబాబు, గోళ్ళ నాగేశ్వరరావు, కోట శ్రీనివాస చక్రవర్తి, జ్యోతుల నాగసత్యశ్రీనివాస్, కరోతు సత్యనారాయణ, రౌతు సహదేవుడు, కోరాడ నారాయణరావు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలానికి చెందిన ఉప్పలపాడు గ్రామంలో చేపట్టిన రోడ్డు పనులను ఎంపిడిఒ నాతి బుజ్జి గురువారం పరిశీలించారు. ఉప్పలపాడు నుంచి తాళ్ళూరు వరకూ రూ.90 లక్షలతో చేపట్టిన బిటి, సిసి రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్ అండ్ బి జగ్గంపేట సబ్ డివిజన్ డిఇఇ వై.ఉమాశంకర్‌తో కలిసి ఆమె పరిశీలించారు. గ్రామంలో వీధి లైట్లు, రోడ్డు ఆక్రమణలపై ఆమె సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అడబాల ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పాడా కృషి

ప్రజాశక్తి - పిఠాపురం


అధికారులతో చర్చిస్తున్న పాడా పీడీ చైత్రవర్షిణి

నియోజకవర్గంలో నెలకున్న సమస్యల పరిష్కారానికి పాడా ప్రత్యేక కృషి చేస్తుందని పాడా పీడీ చైత్రవర్షిణి అన్నారు. గురువారం స్థానిక పాడా కార్యాలయంలో నియోజకవర్గంలోని 3 మండలాలకు చెందిన వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యలను తక్షణమే పాడా కార్యాలయం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎపిడి పి.వశంతమాధవి, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇవిఎంలకు పటిష్ట బందోబస్తు : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఇవిఎం, వివిపాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం గోదామును రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఇవిఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎం, వివిపాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఇవిఎంల గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గోదామును పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా అగ్నిమాపక అధికారి పివిఎస్.రాజేశ్, అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి ఎం.జగన్నాథం, రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.సాయిబాబా, ఎస్.అప్పారావు, బి.జయప్రకాష్, ఆర్. వెంకటేశ్వరరావు, టి.ఈశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన శిరీషకు సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్


శిరీషాను సత్కరిస్తున్న స్థానికులు

సచివాలయ కార్యదర్శిగా సేవలు అందించిన శిరీష పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగన్నతి పొందిన సందర్భంగా అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్కరించారు. గురువారం అడబాల ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఓరుగంటి సూరిబాబు, ఎస్.శ్రీనగేష్, జి.కృష్ణమోహన్, ప్రసాద్ నాయుడు, రాజా, రవిశంకర్ పట్నాయక్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చేపల వేటపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్

పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే ఎస్ఎఫ్‌సిఎల్ చెరువులో అనధికార చేపల వేటకు అడ్డుకట్ట వేయాలని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యను కోరారు. గురువారం ఆయన కమిషనర్‌ను కలిసి ఫిల్టర్ బెడ్ చెరువు పరిస్థితిపై వివరించారు. ఫిషర్ మెన్ సొసైటీకి చేపలవేటకు ఇచ్చిన గడువు ఈనెల 16వ తేదీతో ముగిసిందని తెలిపారు. 10 రోజుల్లో చెరువును మొత్తం ఎండగట్టి కొత్తగా నీరు పెట్టాల్సివుందన్నారు. అయితే రాత్రి సమయాల్లో ఔట్‌లెట్ వాల్వ్‌ను ఆపి అనధికారికంగా చేపల వేట కొనసాగిస్తున్నారని వివరించారు. అనధికారిక చేపల వేటను నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు, ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని ఆయన కోరారు.

భీమేశ్వరుని హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - సామర్లకోట


ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవకులు

భీ మే శ్వ ర ఆలయంలో హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ తనిఖీ అధికారి ఫణికుమార్ ఆధ్వర్యంలో 105 రోజులకు సంబంధించిన ఆదాయాన్ని లెక్కించారు. నగదు రూపంలో రూ.16,15,788, 67 గ్రాముల బంగారు వస్తువులు, 600 గ్రాముల వెండి వస్తువులు సమకూరినట్లు ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. అలాగే దర్శనం టికెట్ల ద్వారా రూ.7,05,960, సేవా టికెట్ల ద్వారా రూ.65,747, ప్రసాద అమ్మకాల ద్వారా రూ.2,66,215, అన్నదానానికి వచ్చిన విరాళాలు రూ.3,12,696 వెరసి రూ.29,66,406 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మెన్ కంటే జగదీష్‌మోహన్, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, దేవస్థానం అర్చకులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు పారేలా డ్రెయినేజీ నిర్మించాలి

ప్రజాశక్తి - పిఠాపురం


డ్రెయినేజీ వద్ద నిల్వ ఉండిపోయిన మురుగునీటిని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

పట్టణంలోని 2, 3, 4వ వార్డుల్లో మురికి నీరు పూర్తి స్థాయిలో పారేలే డ్రెయిన్లను నిర్మించాలని సిపిఎం నాయకులు కె.విశ్వనాథం డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిపిఎం ప్రజాచైతన్య యాత్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు పలు సమస్యలను బృందం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వైఎస్ఆర్ గార్డెన్స్‌లో డ్రెయినేజీని నిర్మిస్తున్నారని, అయితే ఆ డ్రెయిన్‌ను వజ్రాల కాలువ వరకు నిర్మించకుండా సగంలోనే పనులను నిలిపివేశారని తెలిపారు. దీనివల్ల పైనుంచి వచ్చే మురికి నీరంతా అక్కడే నిల్వ ఉండిపోవడంతో ప్రజలకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణమే అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి డ్రెయినేజీని వజ్రాల కాలువ వరకు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారిశుధ్యం, వీధిలైట్లు నిర్వహణ అంతంత మాత్రంగానే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.చిన్న, కోనేటి రాజు, వి.సూర్యనారాయణ, కె.మణి, రాజ్యలక్ష్మి, మణికంఠ, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

ఆశీల వేలం వాయిదా

ప్రజాశక్తి - పెద్దాపురం


వేలంపాట నిర్వహిస్తున్న కమిషనర్

మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఆశీలు వేలం పాటలో ఎవరూ పాల్గొనక పోవడంతో వేలం పాటను వాయిదా వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పద్మావతి మాట్లాడుతూ వేలం పాటలో ఎవరూ పాల్గొన లేదని, దీంతో ఈనెల 24వ తేదీకి వేలం పాటను వాయిదా వేశామన్నారు. గత ఏడాది ఆశీలు వేలం పాట ద్వారా మున్సిపాలిటీకి రూ.16.60 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే రెండుసార్లు వేలంపాటలు నిర్వహించినప్పటికీ ఎవరూ ఈ వేలం పాటల్లో పాల్గొనలేదన్నారు. మేకల కబేలాకు నిర్వహించిన వేలంలో రూ.43,500కు పాడుకున్న మహమ్మద్ గౌస్‌కు వేలంను ఖరారు చేసినట్లు కమిషనర్ తెలిపారు.

చైల్డ్ సేఫ్‌పై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు


మండలంలోని చేబ్రోలులోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో చైల్డ్ సేఫ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 12 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలకు వ్యక్తిగత భద్రత, విద్య, బాలల లైంగిక వేధింపులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆర్‌డిఎ హెచ్‌డిజి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని 20 మండలాల్లో ఉన్న గ్రామ సంఘం అధ్యక్షులు, విఒఎలకు ఇస్తున్న శిక్షణలో తెలుసుకున్న అంశాలను గ్రామాల్లో మహిళకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం సన్యాసిరావు, సిసిలు రాజకుమారి, పేరయ్యనాయుడు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష గడువు పొడిగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సుధా కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయంలో జూనియర్ ఇంటర్మీడియట్, 5వ తరగతి బ్యాక్ లాగ్ అడ్మిషన్లు కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25 వరకూ పొడిగించినట్లు ప్రిన్సిపల్ ఎర్నెస్ట్ సికెపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, బ్యాక్ లాగ్ అడ్మిషన్లు 6, 7, 8, 9 (ఇంగ్లీష్ మాధ్యమం) తరగతుల ప్రవేశానికి అర్హులైన బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.

కార్టూ'నిజం'



సునీత విలియమ్స్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

భారత సంతతి వ్యోమోగామి సునీత విలియమ్స్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. గురువారం స్థానికంగా సునీత విలియమ్స్‌కు స్వాగతం పలుకుతూ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంతరిక్షంలో 9 రోజులపాటు పరిశో ధనల కోసం వెళ్లిని ఆమె సాంకేతిక కారణాలవల్ల 9 నెలలు అంతరిక్షంలోనే ఉండిపోయి తిరిగి భూమిపైకి వచ్చిన సునీత విలియమ్స్ దృఢ సంకల్పం ప్రతి స్త్రీ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయబాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు స్వర్ణపూడి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ నాయకుడు ఎడివి.ప్రసాద్, ఎంఇఒ బి.అబ్బాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిఎండిఎస్ విత్తనాలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - కరప

ప్రకృతి వ్యవసాయంలో పిఎండిఎస్ విత్తనాల ప్రాముఖ్యత ఎంతో ఉందని, సంబంధిత విత్తనాలను రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియాజర్ అన్నారు. గురువారం కొంగోడులో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎండిఎస్ విత్తనాల కిట్లను రైతులకు అందించేందుకు సిద్ధం చేయాలన్నారు. పంట కోతకు వచ్చే సమయంలో నేలను ఎండిపోకుండా పచ్చదనంగా ఉండేందుకు పిఎండిఎస్ విత్తనాలు రైతులతో వేయించడం వలన భూమిలో సూక్ష్మ దాతువులు పెరిగేందుకు తోడ్పడుతుందన్నారు. ఘనజీవామృతాన్ని తయారు చేసి రైతులకు అందించేందుకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్జున్‌కుమార్, ఎపిసిఎస్ఎఫ్ సిబ్బంది ఎంటి.ధనలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


కిర్లంపూడిలో జరిగిన శిక్షణా తరగతుల్లో అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలకు శిక్షణా తరగతుల ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామర్లకోట మండల అంగన్‌వాడీలకు, ఎన్‌టిఆర్ కాలనీలోని రాజీవ్ మున్సిపల్ స్కూల్లో పెద్దాపురం మండల అంగన్‌వాడీలకు శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో యుడిసి బివివిఎస్-ఎస్ఆర్.మూర్తి, ఎల్‌డిసి ఎన్.నాగేంద్ర పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌లో అంగన్‌వాడీలకు శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. చొల్లంగి హైస్కూల్లో జరిగిన ఈ శిక్షణలో జాతీయ విద్య విధానం, జాతీయ పాఠ్య ప్రణాళిక, నవ చేతన, ఆధార్ శిల అంశాలపై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిడిపిఒ మాధవి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **కిర్లంపూడి** మండలంలోని బూరుపూడి గ్రామంలోని ఎంపిపి పాఠశాలలో అంగన్‌వాడీలకు శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ శిక్షణ తరగతులు 3 రోజులు కొనసాగుతాయని ఎస్ఎల్ఎంటి సభ్యులు పి.బూసమ్మ, కరీ మునిసా తెలిపారు.

నేరాలు ఘోరాలు


కుమార్తె మృతి కేసులో అరెస్ట్ అయిన తండ్రి రాజు

కుమార్తె మృతి కేసులో తండ్రి అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

కన్న కూతుర్ని, కొడుకుని కాలువలో తోసిన ఘటనలో కూతురు మృతికి కారణమైన తండ్రి పిల్లి రాజును పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి వివరాలను గురువారం రామచంద్రపురం డిఎస్‌పి బి. రఘువీర్ విలేకరులకు వివరించారు. రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు అప్పులకు భయపడి పిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసు కోవాలని అనుకున్నాడుని తెలిపారు. పథకం ప్రకారం తన కుమారుడు రామ సందీప్‌ను, కుమార్తె కారుణ్యలను వారు చదువుతున్న భాష్యం స్కూల్ నుండి ఈ నెల 17న తీసుకువచ్చాడన్నారు. నెలపర్తిపాడు వద్దగల గణపతి నగర్ పంట కాలువ వద్ద కు వారిద్దరినీ తీసుకువెళ్లి కుమార్తెను, కుమారుడును కాలవలోనికి తోసివేశాడన్నారు. ఈ సంఘటనలో కుమార్తె కారుణ్య(7) అక్కడికక్కడే మృతి చెందిందని అన్నారు. ఈ సంఘటనలో కుమారుడు తప్పించుకుని విషయాన్ని పోలీసులకు తెలిపాడన్నారు. ఈ ఘటనపై ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ లో ఈ నెల 17న కేసు నమోదు చేశామన్నారు. అప్పటినుండి మూడు బృందాలుగా పోలీసులు ఏర్పడి నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. రాజానగరం మండలంలోని రాధేపాలెం లో తమ బంధువులు ఇంటి వద్ద ఆశ్రయం పొందేందుకు వెల్లగా వారు మండపేట రూరల్ పోలీస్ స్టేషన్లో నిందితుడిని అప్పగించారు. విషయం తెలుసుకున్న రామచంద్రపురం సిఐ వెంకటనారాయణ నిందితుడిని అరెస్టు చేసి రామచంద్రపురం తీసుకువచ్చారని డిఎస్‌పి తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

కదులుతున్న రైలు నుంచి దిగుతుండగా జారిపడి యువకుడు మృతి చెందాడు. జిఆర్‌పి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పెద్దాపురంకు చెందిన సిముసిరి త్రినాథ్ (37) తన తల్లిని విశాఖపట్నం ఆసుపత్రికి తీసుకెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో విశాఖ ఎక్స్‌ప్రెస్‌లోని మహిళల బోగీలో ఆమెను ఎక్కించారు. సాధారణ బోగీ ఎక్కిన ఆయన సామర్లకోటలో దిగలేదు. తల్లి రైలు దిగి కుమారుడికి ఫోను చేయగా నిద్రపోతున్న త్రినాథ్ లేచి హడావుడిగా రైలు నుంచి దిగేందుకు ప్రయత్నించారు. అప్పటికే రైలు కదలడంతో ప్రమాదవశాత్తు రైలు కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఎల్ఐసి ఏజెంట్‌గా పని చేస్తున్నాడు.

గడ్డి మందు తాగిన వివాహిత మృతి

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెద్దప్పురపాడు శివారు వై.సావరం గ్రామానికి చెందిన కోరం సాధన(28) గడ్డి మందు తాగి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...కోరం రాజశేఖర్‌కు తాళ్లరేవు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన సాధనతో 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే భార్యపై అనుమానంతో ఆమెను అనుమానంతో శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ రాత్రి ఆమెకు, భర్తకు మధ్య గొడవ జరిగింది. ఈ సందర్భంగా చస్తే చావు అనడంతో ఆమె ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగేసింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు కాకినాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. బుధవారం ఆమె ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు ఎస్ఐ టి.సునీత తెలిపారు. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని నార్కెడి మిల్లి గ్రామ శివారు బుధవారం అర్ధరాత్రి సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను లోడు చేసి తరలించుటకు సిద్ధంగా ఉంచిన ట్రాక్టరు ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము గురువారం తెలిపారు.

నేడు యానాం బంద్

ప్రజాశక్తి - యానాం

యానాం డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని శుక్రవారం యానాంలో బంద్ జరగనుంది. ఈ బంద్‌లో భాగంగా వర్తక, వాణిజ్య సంస్థలు, ఇతర షాపులు స్వచ్ఛందంగా మూసివేసి మద్దతు ఇవ్వాలని యానాం వర్తక సంఘం ప్రతినిధులు మాజేటీ సత్యభాస్కర్, నల్లా వెంకన్న, కాపగంటి గోపాలకృష్ణ యానాంలో డంపింగ్ యార్డ్ సమస్య తో ఎక్కడిచెత్త అక్కడే కొన్ని రోజులుగా నిలిచి పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమస్య అందరదీ కనుక వ్యాపారులు ఆయా సంస్థలు యజమానులు బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బంద్‌ను విజయవంతం చేయండి..

యానాంలో నేడు జరుగుతున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. రాజకీయాలకు అతీతంగా అందరి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలియచేసేందుకు జరుగుతున్న బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భాస్కర్ కాలనీ ఇమ్మానుయేల్ చర్చిలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బ్లెస్సింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పిఠాపురం సిఎంసి సౌజన్యంతో నిర్వహించిన శిబిరాన్ని వార్డు కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ ప్రారంభించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు.

పిల్లలు బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి - సామర్లకోట

బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండేలా తల్లిదండ్రులను ఉపాధ్యాయులు చైతన్యం పరచాలని ఎంఇఒ-2 పి.పుల్లయ్య అన్నారు. గురువారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో బడి మానేసిన ఇద్దరిని తిరిగి బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని అన్నారు. బడి ఈడు పిల్లలు బాల కార్మికులుగా పని చేయడం నేరమని, ప్రభుత్వ బడుల్లో ఉన్న నాణ్యమైన ఉచిత విద్యను పిల్లలకు అందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్, జి.బేబీరాణి, తదితరులు పాల్గొన్నారు.


బడి బయట బాలుడిని బడిలో చేర్చుతున్న ఎంఇఒ

కార్యకర్తల సేవలకు గుర్తింపు ఇవ్వండి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కష్టపడి పని చేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని వైసిపి నాయకుడు పెట్ల సూర్యనారాయణ రాజు వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డిని కోరారు. గురువారం తాడేపల్లిలో ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించినట్లు స్థానిక విలేకరులకు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి తన భార్య శాంతకుమారితో కలిసి పార్టీ పట్టిష్టతకు కృషి చేసినట్లు తెలిపారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీని వీడలేదని,తన కష్టానికి గుర్తింపు నివ్వాలని కోరినట్లు వెల్లడించారు. ఆయన వెంట వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు శ్రీనివాసరావు, నాయకులు సవరపు కన్నబాబు, దార్ల సత్యనారాయణ ఉన్నారు.


జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న సూర్యనారాయణరాజు

91వ సారి రక్తదానం చేసిన తాతీలు

ప్రజాశక్తి - కరప

కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు 91వసారి రక్తదానం చేశారు. మండలంలోని నరకుదురు గ్రామానికి చెందిన ఎ.రామయ్యకు కరెంటు షాక్‌కు గురికావడంతో అతనికి రక్తం అవసరం కావడంతో గురువారం కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న అతనికి తాతీలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. 91వ సారి రక్తదానం చేయడమే కాకుండా ఎంతో మందికి ప్రతి రోజూ సకాలంలో డోనార్స్‌ని ఏర్పాటు చేస్తున్న తాతీలును డాక్టర్ పెంటగట్ల మణికుమార్, మణి అన్న బ్లడ్ ఆర్మీ సేవ సంస్థ అభినందనలు తెలిపారు.


రక్తదానం చేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

ఆదరణ పథకాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

చేతి వృత్తిదారుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఆదరణ-3 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చేతి వృత్తిదారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చేతి వృత్తిదారుల ఉపాధి కల్పనకు ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. రజక, నాయి బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, కుమ్మరి తదితర వృత్తిదారులకు అవసరమైన పనిముట్లను అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో చేతి వీత్తిదారులకు అవసరమైన పనిముట్ల వివరాలను నమోదు చేసుకున్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - గండేపల్లి

పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు. గురువారం ఎన్‌టి.రాజపురం గ్రామానికి చెందిన ఒడిసెల గౌరమ్మకు చెందిన పొలం సర్వే నెంబర్ తప్పుపడింది. సరి చేయాలని పిజిఆర్ఎస్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో అర్జీదారు నుంచి గురువారం ఆమె ఫీడ్ బ్యాక్ తీసుకుని అర్జీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి రామనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో గురువారం సామర్లకోటకు చెందిన వైఆర్ఎల్ఐటి కాన్సెప్ట్ స్కూల్ 7వ తరగతి విద్యార్థులకు సామాన్యశాస్త్రంలోని పాఠ్యాంశాలపై ప్రయోగాల ద్వారా అవగాహన కల్పించారు. సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కలలో పోషణ, జంతువుల్లో పోషణ, ఉష్ణం పాఠ్యాంశాలకు చెందిన అనేక ప్రయోగాలను విద్యార్థులతో చేయించారు.

22లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

రుణాల కోసం ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బిసి, కాపు, కమ్మ, బ్రాహ్మణ, ఆర్యవైశ్య కులాలకు చెందిన యువత వివిధ వృత్తులు, వ్యాపారాల ద్వారా ఉపాధి పొందేందుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రూ.1.50 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు 50 శాతం రాయితీపై కూడిన రుణాలు అందజేస్తుందన్నారు. మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహణ

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒంటి పూట బడులకు బదులు ఉదయం నుంచీ సాయంత్రం వరకు పాఠశాలలను ఎలా నిర్వహిస్తారని ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక కెఎస్ఎన్ స్కూల్ నిర్వాహకులను నిలదీశారు. విద్యార్థులను ఎండల్లో కూడా తరగతులకు రప్పించి ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. వెంటనే పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, మండల నాయకులు రవికుమార్, వినయ్, జ్ఞానేంద్ర తదితరులు డిమాండ్ చేశారు.



CHANGE OF NAME

I. MELLAM SOLOMON DAVIDSON, S/o. Mellam Joseph Davidson, D.No. 46-15-16/6, F4, Katta Towers, Yerukonda Street, Rajahmundry, E.G.Distrct, A.P., PIN: 533103, I have changed my name from **MELLAM SOLOMAN DAVIDSON** (Old Name) to **MELLAM SOLOMON DAVIDSON** (New Name). Hence forth Iam being called **MELLAM SOLOMON DAVIDSON,** S/o. Mellam Joseph Davidson, for all purpose.

దస్తావేజులు పోయినవి

నా ఆస్తి తాలూకు దస్తావేజులు అనగా **1) ది. 16-04-1969. సెటిల్‌మెంట్ దస్తావేజు నెం. 685/1969, 2) ది.15-03-1971 సెటిల్‌మెంట్ దస్తావేజు నెం. 366/1971** పిఠాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసు లో రిజిస్ట్రేషను అయినవి.

సదరు ఒరిజినలు దస్తావేజులు తోకూడిన బ్యాగు **ది. 15-03-2025వ తేదీన** జిరాక్స్ నిమిత్తం తూరంగి లోని నా ఇంటి నుండి తూరంగి మెయిన్ రోడ్ (కోటిపల్లి రోడ్) నకు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది. అచ్చట అందరిని అడిగినాను, వెతికినాను అయినా నా ఒరిజినలు దస్తావేజు తో కూడిన బ్యాగు లభ్యము కాలేదు.

సదరు దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సులో అందజేసిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును.

యాళ్ల సూర్య నారాయణ, S/o. బుచ్చిబాబు,
డో.నెం. 1-81, తూరంగి,
కాకినాడ రూరల్ మండలం, కాకినాడ జిల్లా.

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు (MACT), కాకినాడ

M.V.O.P. No. 34/2023

Between:

బాకి నూకరత్నం, వగైరాలు -పిటిషనర్స్

AND

సిమ్మ వీరబాబు, వగైరాలు -రెస్పాండెంట్స్

R-2: అడుసుమిల్లి మోహన్ రామదాస్, ప్రొప్రయిటర్: మహాలక్ష్మి ఆటో వెంచర్స్, Tafe Tractors Dealer, ప్లాట్ నెం. 51, ఆటోనగర్, సర్పవరం, కాకినాడ, కాకినాడ జిల్లా.

(Owner of Tractor bearing Chasis No: MEA 665 A5 GN 2436160, Engine No: S 3371 B 79942)

పై నంబర్ పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు సమన్స్ పంపినప్పటికి తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు సమన్ల అమలు నిమిత్తం **ది. 08-4-2025వ తేదీన వాయిదా అయి ఉన్నది. ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(By Court Order)

K.V.BHADRA RAO
K.SRIVANI
K.S.CHANDRA RAO
Advocates, Kakinada

మహారాజశ్రీ 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు (MACT) :: పిఠాపురం

M.V.O.P. No.25 / 2022

Between:

గొర్ల సత్యవేణి & వగైరాలు ...పిటిషనర్స్

మరియు

కరాటం శ్రీనివాసరావు & వగైరాలు ...రెస్పాండెంట్స్

To:

R4: కోర్ని మీనాక్షి, W/o. వరప్రసాద్, విజయ రెసిడెన్సీ, ప్లాట్ నెం. T1, 3rd Floor, ఆనంద భారతి వెనుక, చర్చి వీధి, కాకినాడ.

R5: సర్వసిద్ధి పద్మశ్రీ బాల త్రిపుర సుందరి, W/o. వెంకట సత్య వరహాలబాబు, డో.నెం. 1-43-1/6, ఉషోదయ జంక్షన్, ఆదర్శ నగర్, సాయిబాబా గుడి దగ్గర, పెదవాల్తేరు, విశాఖపట్నం.

పై నెంబరు పిటిషన్‌లో 4వ మరియు 5వ రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**27-03-2025** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ **10.30** ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

కొశిరెడ్డి పేర్రాజు
పిటిషనర్స్ తరపు అడ్వకేట్, పిఠాపురం
సెల్: 9705933799

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు (MACT), కాకినాడ

M.V.O.P. 60/2023

Between:

బర్రే సత్యవతి, వగైరాలు -పిటిషనర్స్

AND

కుచిమంచి సుబ్బారావు, వగైరాలు -రెస్పాండెంట్స్

R-1: కుచిమంచి సుబ్బారావు, S/o. సుబ్బారావు, వయస్సు 50 సం॥లు, డో.నెం. 7-2-16, చపాల వీధి, పెద్దాపురం, పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా (డ్రైవర్ TATA Ace వ్యాన్ బేరింగ్ నెం. AP 05 TD 8203)

పై నంబర్ పిటిషన్‌లో 1వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపినప్పటికి తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు సమన్ల అమలు నిమిత్తం **ది. 10-4-2025వ తేదీన వాయిదా అయి ఉన్నది. ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(By Court Order)

K.V.BHADRA RAO
K.SRIVANI
K.S.CHANDRA RAO
Advocates, Kakinada
Cell: 94401 77063

ప్రకటన

నా క్లయింట్ అయిన పెద్దాపురం మండలం చినబ్రహ్మదేవం గ్రామం మెయిన్‌రోడ్డు కాపురస్తులు **ముమ్మిడి వెంకటరమణ గారి కుమారుడు వీరబాబు నాకు** యిచ్చిన సంజాయిషి ప్రకారం యావన్మందికి తెలియచేయునది ఏమనగా.

నా క్లయింటు యొక్క లింకు దస్తావేజు అనగా ది. 15-10-2007న నా క్లయింటు తండ్రి గారైన ముమ్మిడి వెంకటరమణగారు వేట్కూరి సూర్యనారాయణ వగైరాల వల్ల క్రియం పొంది ది. 15-10-2007 న సామర్లకోట సబ్-రిజిస్ట్రారు వారి కార్యాలయం లో ద.నెం.4848/2007రుగా రిజిష్ట్రి పొందినటువంటి యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన దస్తావేజు 15-03-2025వ సం.రం. తేదిన నా క్లయింటు తన ఇంటి నుండి పెద్దాపురం నందు గల జెరాక్సు షాపు కు వెళ్ళుచుండగా సదరు దస్తావేజు బ్యాగు పడిపోయినది. కనుక సదరు దస్తావేజు గల బ్యాగు దొరికిన యెడల నాకు అందచేయగలరు. యింకనూ తెలియచేయినది ఏమనగా సదరు దస్తావేజును పురస్కరించుకుని దస్తావేజులు దాఖలు చేయుటకు నా క్లయింటు ఏర్పాట్లు చేసుకునియున్నారు. యింకనూ సదరు దస్తావేజును పురస్కరించుకుని ఎవ్వరైనా ఎట్టి అన్యాక్రాంతములు చేసిననూ అట్టివి ఎంతమాత్రం నా క్లయింటును బైండు చేయజాలవు.

ఆస్తికి షెడ్యూలు: ప్రస్తుతం కాకినాడ జిల్లా, పెద్దాపురం మండలం సామర్లకోట సబుడి చినబ్రహ్మదేవం గ్రామం తాలూకు జిరాయితి మెరక స.నెం. 199 రు పూరా య. 16.53ట్లులో మధ్య మా తాలూకు య.0.6ట్లులో ఈశాన్యం మూలన గల య. 0.10ట్లు అనగా 0.040ర్లు వ్యవసాయ భూమికి **హద్దులు: తూర్పు:** గవర్నమెంటు వారి పుంత. **పడమర:** మా తాలూకు యీ నెంబరులో మిగతా భూమి. **ఉత్తరం:** గవర్నమెంటు వారి పుంత. **దక్షిణం:** మా తాలూకు యి నెంబరులో గల మిగతా భూమి.

సదరు హొద్దుల మధ్యస్తమయిన య. 0.10ట్లు అనగా 0.040ర్లు వ్యవసాయ భూమి అందుల సర్వం సహా.

పి. సూర్యకళ, అడ్వకేట్
#9-2-2/1, ఎల్విన్ పేట, కాకినాడ.

నోటి పరిశుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తీసుకునే ఆహారం సక్రమంగా జీర్ణం కావాలంటే నోటి ఆరోగ్యం ముఖ్యమని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. గురువారం రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికంగా తీపి పదార్థాలు తీసుకోవడం, ధూమపానం, మద్యపానం వలన నోటి రుగ్మతలకు దారి తీస్తాయని అన్నారు. దీని నివారణకు ఏ ఆహారం తీసుకున్నా, తాగినా నోటిని నీటితో పుక్కిలించాలని, ఉదయం రాత్రి పడుకోబోయే ముందు బ్రష్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

పరదేశమ్మకు వెండి గరగ బహూకరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని ఇంజరం గ్రామంలో ఉన్న పరదేశమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన వట్టెం గౌరీరాజ్యలక్ష్మి, మల్లిబాబు దంపతులు రూ.లక్ష విలువ చేసే వెండి గరగను గురువారం బహుకరించారు. గ్రామ సర్పంచ్ ముద్దన వెంకటశివరామప్రసాద్ మాట్లాడారు. అమ్మవారికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

'పార్టీని బలోపేతం చేయాలి'

ప్రజాశక్తి - కిర్లంపూడి

వైసిపిని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. గురువారం ఏలేశ్వరం మండలం బద్రవరం గ్రామానికి చెందిన పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయనను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపికి కార్యకర్తలే బలమని, గతంలో పార్టీకి ఎంతగానో అండగా నిలిచారని, రాబోయే కాలంలో గ్రామాల్లో పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం మున్సిపాలిటీ కౌన్సిలర్లు సామంతుల హైమావతికుమార్, సుంకర హైమావతి రాంబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కోసూరి

సమిష్టి కృషి వల్లే కెసిబిఎస్ ప్రగతి

ప్రజాశక్తి - కాకినాడ

ఖాతాదారుల తోడ్పాటు, ఉద్యోగుల సమిష్టి కృషి వల్లే ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సంస్థ సమర్థవంతమైన సేవలు అందిస్తుందని సంస్థ చైర్మన్ కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం స్థానిక సినిమా రోడ్‌లోని కెవికె.రావు ఆడిటోరియంలో కెసిబిఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత డైరెక్టర్లతో కలిసి ఆయన జ్యోతిప్రజ్వలన చేశారు. మేనేజర్ చీమలకొండ గంగాధరం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనను సభ ముందు ఉంచారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కోసూరి మాట్లాడుతూ ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. కెసిబిఎస్ ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్ మాట్లాడుతూ కెసిబిఎస్ ప్రగతిలో భాగస్వాములైన సభ్యుల వ్యక్తిగత ఆరోగ్యంపై సంస్థ ప్రత్యేక దృష్టి సారించి ఉచిత వైద్య శిబిరాలతో పాటు మరెన్నో సేవా కార్యక్రమాలు అందిస్తోందన్నారు. ఈ సమావేశంలో కెసిబిఎస్ ప్రధాన కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివ బాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, సభ్యులు పాల్గొన్నారు.


పాదయాత్రగా వెళ్తున్న వసంత్

అన్నవరం వరకు పాదయాత్ర

ప్రజాశక్తి - గండేపల్లి

కూటమి విజయం సాధించినందుకు, గ్రామ అభివృద్ధి కోసం మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ అన్నవరం దేవస్థానానికి గురువారం పాదయాత్ర ప్రారంభించారు. మొక్కు తీర్చుకునేందుకు ఈ పాదయాత్రను నిర్వహించారు. తొలుత ఆయన గుబ్బలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వసంత్ మాట్లాడుతూ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన వెంట సర్పంచ్ కుక్కల ఆనంద్‌బాబు, నాయకులు దాసరి మోహన్ కుమార్, పెండ్యాల రమణ, చింతమనేని చంటిబాబు, తదితరులున్నారు.

రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి



నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం రాయితీపై రుణాలను అందిస్తుందని, ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవలని టిడిపి మండల అధ్యక్షులు చదరం చంటిబాబు పిలుపునిచ్చారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిరక్షరాస్యులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం రాయితీపై బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తుందన్నారు. రూ.లక్ష నుంచి రూ.8 లక్షల వరకూ రుణం ఇస్తుందని, కావున నిరుద్యోగులు ఈ అవకాశాన్ని నిద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జనసేన నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - కరప

మండలంలోని గొడ్డటిపాలెం జనసేన కార్యకర్త పల్ల ప్రసాద్ తాతయ్య ఇటీవలే మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను, విలేఖరి పలివేల రమేష్ తండ్రి సత్యం, కొరుపల్లి గ్రామం మాజీ సర్పంచ్ రెడ్డి సత్యనారాయణ తండ్రి ఇటీవల మతి చెందగా వారి కుటుంబ సభ్యుల్ని జనసేన మండల అధ్యక్షులు బండారు మురళి, నాయకులు ముద్రగడ రమేష్, గంట నానిబాబు, ముత్యాలరావు, కోరుపల్లి ఎంపిటిసి రెడ్డి లోవరాజు, గుబ్బల భవాని , అంజూరి నాని వెంకటరమణ తదితరులు పరామర్శించారు.

మండలంలో పర్యటించిన పాడా పీడీ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని పలు ప్రాంతాల్లో పాడా పీడీ చైత్రవర్షిని గురువారం పర్యటించారు. సుద్ద గడ్డ కాలుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఆమె పరిశీలించారు పనులను వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించారు. అనంతరం మండలంలోని చేబ్రోలు గ్రామంలో పట్టు గుళ్ళ షెడ్‌ని సందర్శించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టుపరిశ్రమ మార్కెట్‌కి వెళ్లి అధికారులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఎపీడీ పి.వసంతమాధవి, సంబంధిత మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న జడ్జి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారిని గురువారం పిఠాపురం జడ్జి ఎం.విజయ రామేశ్వరి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు దేవస్థానం తరుపున ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో సత్కరించి వేదాశీర్వచనాలతో అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పురపాలక సంఘ కార్యాలయం, పెద్దాపురం

ఆర్.ఒ.సి. నెం. 39/2025-ఎ2 — తేదీ: 20-03-2025

బహిరంగ వేలం నోటీసు (మూడవ పిలుపు)

2025-26 ఆర్థిక సం॥నకు అనగా ది. 01-04-2025 నుండి ది. 31-03-2026 వరకు పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో రోడ్ మార్జిన్ల యందు, రోజువారీ మార్కెట్, వారపు సంత మార్కెట్ మరియు తీర్థ సమయముల యందు రుసుము వసూలు చేసుకొను గుత్త హక్కు కొరకు గెజిట్ నెం. 8/2025, తేదీ: 03-02-2025 లో గల షరతుల ప్రకారం ది. 24-03-2025 అనగా సోమవారం ఉదయం 11.00 గం॥ల నుండి పురపాలక సంఘ కార్యాలయపు ఆవరణములో బహిరంగ వేలము పాటలు నిర్వహించబడును. సదరు వేలములో పాల్గొనదలచిన వారు పాట వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలో రెవెన్యూ విభాగం నందు సంప్రదించవలెను.

సం/- **కమిషనరు**
పెద్దాపురం పురపాలక సంఘం

గ్రామపంచాయతీ కార్యాలయం, అజ్జరం

పెరవలి మండలం, తూర్పుగోదావరి జిల్లా

ఆర్.సి. నెం.03/2025 — తేది: 20-03-2025

టెండరు ప్రకటన

తూర్పుగోదావరి జిలాల్లి, పెరవలి మండలం, అజ్జరం గ్రామపంచాయతీ ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయు సిబ్బంది కొరకు టెండర్లు కోరుతున్నారు. పూర్తి వివరములకు కార్యాలయం పని వేళలో అడిగి తెలుసుకొనగలరు.

1) పరిశుభ్ర పనులు నిర్వహణ స్వీపరు - 04 **2) ట్యాంకు వాచరు - 01**
3) క్లాప్ మిత్ర - 02 **4) ఎలక్ట్రీషియన్ - 01**

శ్రీమతి గారపాటి వెంకట నాగ సుధా
సర్పంచ్, అజ్జరం గ్రామపంచాయతి
పెరవలి మండలం, తూ॥గో॥జిల్లా

సం/- **కె.మల్లిఖార్జునరావు**
పంచాయతి కార్యదర్శి, అజ్జరం గ్రామపంచాయతి
పెరవలి మండలం, తూ॥గో॥జిల్లా

గ్రామ పంచాయతీ కార్యాలయము - వలసపాకల

రి.క.నెం. 10/2024-25 — తేది:10-03-2025

టెండరు నోటీసు

కాకినాడ రూరల్ మండలం, వలసపాకల గ్రామపంచాయితీకు సంబంధించి 2025-2026 ఆర్థిక సంవత్సరములో గ్రామపంచాయితీ నిధులతో ఈ దిగువ తెలిపిన విధంగా అవసరమైన కాంట్రాక్టు పద్ధతిపై పారిశుద్య కార్మికుల సేవలు చేయుటకు, మరియు రక్షిత మంచినీరు, పారిశుద్ధ్య పనిముట్లు, పబ్లిక్ హెల్త్ కలరా మందులు, స్టేషనరీ అండ్ బుక్స్ & ఫారమ్స్ మరియు ఎలక్ట్రికల్ విడి భాగములు వగైరా సప్లయి కొరకు గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు సీల్డు టెండర్లు ఈ దిగువ సంతకము చేసిన వారిచే గాని, లేదా వారి యొక్క అనుమతి పొందిన వారిచే గాని ది.27-03-2025 గురువారము మధ్యాహ్నం 3:00 గంటల వరకు తీసుకొనబడి, అదే రోజు మధ్యాహ్నం 05:00 గంటలకు అప్పటికి హాజరైన టెండరు దార్ల సమక్షంలో సీల్డు టెండర్లు తెరవబడును. సీల్డు టెండర్లు దాఖలా చేయుటకు చెల్లించ వలసిన ధరావత్తు పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతీ, వలసపాకల వారి పేరున చెల్లుబాటు అగు విధముగా డి.డిలు /MR ద్వారా గాని చెల్లించి, చెల్లించిన రశీదును టెండరు షెడ్యూలునకు జతపరచి సీల్డు కవరు ద్వారా టెండరు సమర్పించవలెను. టెండరు షెడ్యూల్స్ ది.26-03-2025వ తేది సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే ఇవ్వబడును. పై నిబంధనలు పాటించని టెండర్లు మరియు సకాలంలో రాని టెండర్లు స్వీకరించబడవు. టెండరు షెడ్యుళ్ళ రేటు, టెండరు షరతులు, ఇతర వివరములు ఈ కార్యాలయం పనిచేయువేళలో వచ్చి తెలుసుకొనవలెను. గ్రామ పంచాయితీ నిధుల లభ్యతను బట్టి బిల్లులు చెల్లించబడును మరియు ఎట్టికారణము చూపకుండానే టెండర్లను వాయిదా వేయుటకు గాని రద్దుపరుచుటకు గాని పంచాయితీ కార్యదర్శివారికి పూర్తి అధికారము గలదు.

వ.నెం.	టెండరు కాల పరిమితి	వివరములు	చెల్లించవలసిన టెండరు ధరావత్తు (మనిషి ఒక్కింటికి)
1.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు శానిటరీ మేస్త్రి సేవలు -2	100/-
2.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు PWS ఆపరేటర్ సేవలు -1	100/-
3.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు లైబ్రరియన్ సేవలు -1	100/-
4.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు ఆఫీస్ సబార్డినేట్ సేవలు -1	100/-
5.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు నైట్ వాచ్ మెన్ సేవలు -1	100/-
6.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్ సేవలు -1	100/-
7.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు కంప్యూటర్ ఆపరేటర్ సేవలు -1	100/-
8.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు ట్రాక్టర్ డ్రైవర్ సేవలు -2	100/-
9.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు బరియల్ గ్రౌండ్ వాచ్‌మెన్ సేలలు-1	100/-
10.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు పారిశుద్ధ్య పని స్వీపర్ల సేవలు-30	100/-
11.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	క్లాప్ మిత్ర సేవలు -15	100/-
12.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	రక్షిత మంచినీరు సరఫరా విడిభాగములు సప్లై	500/-
13.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	పారిశుధ్య పనిముట్ల సప్లై	500/-
14.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	పబ్లిక్ హెల్త్ కలరా మందులు (బ్లీచింగ్, ముగ్గు, పినాయిల్, దోమల మందులు వగైరా)	500/-
15.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	స్టేషనరీ, బుక్స్ అండ్ ఫారములు సప్లై కొరకు	500/-
16.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	ఎలక్ట్రికల్ సామానులు, LED లైట్లు విడి భాగములు, LED లైట్లు ఫిట్టింగులు సప్లై	500/-

పైన పట్టిక నందు తెలిపిన సేవలకు మరియు వివిధ సామానుల సప్లై కొరకు టెండర్లు కోరడమైనది.

సం/- **పంచాయతీ కార్యదర్శి**
గ్రామ పంచాయితీ, వలసపాకల, కాకినాడ రూరల్ మండలం